సాక్షి
ఏలూరు
సోమవారం । 2 । అక్టోబర్ । 2023



భక్తుల తాకిడి

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. విశేష పూజలు జరిగాయి. ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



రక్తదానం మహోన్నతం

సాక్షి, భీమవరం: భీమవరంలో శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు పి.రామబద్రిరాజు పాల్గొన్నారు.



భారీ ఊరేగింపు

ఆకివీడు : ఆకివీడులో బొజ్జ గణపయ్య భారీ ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. శక్తివేషాలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ నృత్యాలతో ఊరేగింపు అట్టహాసంగా సాగింది.

న్యూస్‌రీల్

దివ్యాంగురాలికి ఆర్థిక భరోసా



షేక్ కరీమాకు రూ.5 వేల పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగుతోంది. నగరంలోని తంగెళ్లమూడి పోస్టాఫీస్ వీధికి చెందిన షేక్ కరీమా పుట్టుకతో దివ్యాంగురాలు. ఆమెకు రూ.3 వేల వికలాంగ పింఛన్‌ను ప్రభుత్వం అందిస్తోంది. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తంగెళ్లమూడి ప్రాంతానికి వచ్చిన ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కరీమా ఇంటికి వెళ్లారు. ఆమె తన కుటుంబ పరిస్థితిని ఆయన వివరించింది. తనకు డీఎంహెచ్‌ఓ (90 శాతం కంటే అధికంగా అంగవైకల్యం) పెన్షన్ ఇప్పించాలని ఎమ్మెల్యే నానికి విజ్ఞప్తి చేసింది. వెంటనే ఆయన డీఎంహెచ్‌ఓ పెన్షన్ మంజూరు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. ఈనెలలో కరీమాకు డీఎంహెచ్‌ఓ పెన్షన్ రూ.5 వేలు మంజూరైంది. ఎమ్మెల్యే నాని ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి రూ.5 వేల పింఛన్ అందజేశారు. సీఎం జగన్, ఎమ్మెల్యే నానికి ఆమె కృతజ్ఞతలు తెలిపింది. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని కరీమా అన్నారు.

వన్యప్రాణులను సంరక్షిద్దాం

బుట్టాయగూడెం: వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రభుత్వం, వైల్డ్‌లైఫ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అయినా వేటగాళ్ల స్వార్థానికి వన్యప్రాణులు బలవుతున్నాయి. ఏటా ప్రపంచ జనాభా పెరుగుతుండగా వన్యప్రాణుల సంఖ్య మాత్రం తగ్గుతున్నట్లు కనిపిస్తుంది. కొన్ని జాతులు పూర్తిగా కనుమరుగవుతుండగా మరికొన్ని అంతరించిపోయే దశకు దశకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగించేందుకు ఏటా అక్టోబర్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ వన్యప్రాణి వారోత్సవాలను అటవీశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. జంతువులను ప్రతిఒక్కరూ ఆదరించాలని, సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైల్డ్‌లైఫ్ అధికారులు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంతో పాటు పాపికొండల అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు.

అదరిద్దాం.. అభయమిద్దాం

- వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత
- ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ఆవాసంలా పశ్చిమ ఏజెన్సీ
- నేటినుంచి వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు





ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత పులులు



అడవిలో సంచరిస్తున్న ఎలుగుబంటి

1.12 లక్షల హెక్టార్లలో అభయారణ్యం

1,12,500 హెక్టార్లలో పాపికొండల అభయారణ్యం విస్తరించి ఉంది. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో పాపికొండల అభయారణ్యం పరిధిలో ఉన్న బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. వైల్డ్‌లైఫ్ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి జంతువుల కదలికలను గుర్తిస్తున్నారు. అలాగే జంతువుల సంరక్షణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పాపికొండల అభయారణ్యంలో ఎలుగుబంట్లు, కొండగొర్రెలు, జింకలు, కొండచిలువలు, అడవి పందులు, అడవి దున్నలు, ఆగలి, గెద్దలు, నెమళ్లు, చిరుతలు, కురుదు పందులు, చుక్కల దుప్పిలు, సామబాలు, ముళ్ల పందులు, జాకర్స్, ముంగీసలు, అడవి దున్నలు వంటివి ఉన్నాయి.

గతేడాది జంతు గణన

2018లో పాపికొండల అభయారణ్యంలో వైల్డ్‌లైఫ్ అధికారులు జంతుగణనను నిర్వహించి జంతువుల కదలికలను గుర్తించారు. మరలా 2022 జనవరిలో జంతుగణన కార్యక్రమాన్ని చేపట్టారు. పాపికొండల అభయారణ్యంలోని సుమారు 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలను ఏర్పాటుచేసి సర్వేలను నిర్వహించారు. ఈ సర్వేల్లో ఏనుగులు, సింహాలు తప్ప అన్ని రకాల జంతువులు, పక్షులు, ఉభయచర జీవులను గుర్తించారు. అలాగే జంతువుల సంరక్షణపై బేస్ క్యాంప్‌లు ఏర్పాటుచేసి వైల్డ్‌లైఫ్ అధికారులు ప్రత్యేక గస్తీ నిర్వహించడంతోపాటు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేశారు.



నెమలి

వన్యప్రాణి చట్టం.. శిక్షలు

వన్యప్రాణుల సంరక్షణ కోసం సుమారు 48 ఏళ్ల క్రితం వైల్డ్‌లైఫ్ చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం అడవుల్లో తిరిగే పక్షులు, అడవి దున్నలు, ఎలుగుబంట్లు, నెమళ్లు, పులులు, చిరుత పులులు, దుప్పులు, తదితర అడవి జంతువులను వేటాడి చంపితే వన్యమృగాల సంరక్షణ చట్టం-1972 ప్రకారం శిక్షార్హులు. పులిని చంపి దాని చర్మాన్ని, గోళ్లు తీసినా, బంధించినా, విష ప్రయోగం చేసినా, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించినా చట్టంలోని సెక్షన్ 51(ఏ) కింద జైలు శిక్షతోపాటు, జరిమానా విధిస్తారు. అలాగే చిరుతపులికి ఇదే సెక్షన్ వర్తిస్తుందని వైల్డ్‌లైఫ్ అధికారులు తెలిపారు. అలాగే ఎలుగు బంటిని చంపితే సెక్షన్ 68 (ఏ) మొసళ్లు, కోతులను పట్టుకున్నా, చంపినా సెక్షన్లు 428, 429 కింద కేసులు నమోదు చేస్తారు. కుందేళ్లను పట్టుకుంటే సెక్షన్ 148 (సీ), 135 (బీ)కింద కేసులు నమోదు చేసి శిక్ష విధిస్తారు. నెమలిని పట్టుకున్నా, హింసించినా సెక్షన్ 9 కింద శిక్షార్హులు. మిగతా జంతువులు, పక్షులకు సంబంధించి కూడా ఆయా సెక్షన్లు వైల్డ్‌లైఫ్ చట్టంలో పొందుపరిచారు. ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదైతే బెయిల్ కూడా లభించదని జంతు సంరక్షణ అధికారులు చెబుతున్నారు.

సంరక్షణకు ప్రత్యేక చర్యలు



అటవీ ప్రాంతంలోని **జంతువుల** సంరక్షణకు **ప్రత్యేక** చర్యలు తీసుకుం**టున్నాం.** బేస్‌క్యాంప్‌తో **పాటు** ప్రత్యేక బృందాల **ద్వారా** నిఘా ఏర్పాటు **చేశాం.** జంతువులను **వేటాడే** వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో **పాటు** జైలుకు పంపిస్తున్నాం. అలాగే వేస**విలో** వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నాం. చెక్‌డ్యామ్‌లు, ర్యాపిడ్ ఫీల్డ్ డ్యామ్‌లను నిర్మిస్తున్నాం. సోమవారం నుంచి ఈనెల 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించి జంతు సంరక్షణపై ప్రజలకు అవగాహన కలిగిస్తాం.

– ఎం.కల్యాణి, ఫారెస్టు రేంజర్ అధికారి, పోలవరం

ఉత్సాహంగా కరాటే పోటీలు



ఏలూరు రూరల్: ఏలూరు టుబాకో మర్చంట్స్ కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ఉత్సాహంగా సాగాయి. కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్స్ ఎం.ఇబ్రహీంబేగ్, డీఎల్ నారాయణ ఆద్వర్యంలో ఏపీ షాటోఖాన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు పెద్దసంఖ్యలో చిన్నారులు తరలివచ్చారు. కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బడేటి చంటి, కార్యదర్శి నాగం శివ జ్యోతి ప్రజ్వలనం చేసి పోటీలు ప్రారంభించారు. కటా, కుమతి విభాగాల్లో వివిధ వయసుల వారీగా బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఏడేళ్ల చిన్నారి ఎం.నిషితసాయి బంగారు పతకం సాధించి ఆకట్టుకుంది. విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. వచ్చే ఏడాది జాతీయ స్థాయిలో కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సంక్షేమ రథసారథి సీఎం జగన్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతూ 25కు పైగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అలాంటి సీఎంకు ప్రజలంతా అండగా నిలవాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో వాహనమిత్ర లబ్ధిదారులతో కలిసి ఆదివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ టీడీపీని నమ్మితే రాష్ట్ర ప్రజల నోట్లో మట్టి, ఇసుకేనని అన్నారు. మాయమాటలు చెప్పేవారు ఎవరు, ప్రజల కోసం పనిచేసేది ఎవరో బేరీజు వేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 1,938 మంది ఆటో, టాక్సీవాలాలకు ఐదో విడత వాహన మిత్ర కింద రూ.1.93 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రాష్ట్ర చరిత్రలో అంతకు ముందు ఏ ప్రభుత్వం కూడా ఆటో, టాక్సీవాలాల గురించి ఆలోచించలేదన్నారు. పట్టణంలో ఏరియా ఆస్పత్రిని రూ.21.25 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, 23 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారని, బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. 2014లో చంద్రబాబు 650 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మూడు హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్టని టీడీపీకి రాబోయే ఎన్నికల్లో కూడా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పళ్లాలను చెంచాలతో కొట్టడమేమిటని ప్రజలు నవ్వుకుంటున్నారని, ఇలాంటి జిమ్మిక్కుల వల్ల ఓట్లేమీ రాలవని అన్నారు. ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పార్టీ ముసునూరు మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్ లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



వాహనమిత్ర కార్యక్రమంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కేవీ శివప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చా హరిబాబు, రాష్ట్ర డైరెక్టర్లు కలగర వెంకటేశ్వరరావు, పెదగర్ల స్వరూపారాణి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటగిరి పూర్ణిమ, క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, నాయకులు పల్లే రవీంద్రరెడ్డి, ఆరేపల్లి రాంబాబు పాల్గొన్నారు.

3 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐఈఆర్‌పీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 3 నుంచి 5 వరకు పరిశీలిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి, ఎక్స్ అఫీషియో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు డీఈఓ కార్యాలయ ఆవరణలోని సర్వశిక్షాభియాన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. 3న దృష్టి మాంద్యం, బధిర విభాగంలో 1 నుంచి 50 ర్యాంకు వరకు, 4న 51 నుంచి ఆఖరి ర్యాంకు వరకు, 5న బుద్ధి మాంద్యం విభాగంలో అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తామని తెలి పారు. రాష్ట్ర వ్యాప్తంగా భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారిలో 158 మంది అభ్యర్థుల జాబితా జిల్లాకు చేరిందని వీరిలో ఎంఆర్ విభాగంలో 55 మంది, వీహెచ్‌లో 103 మంది ఉన్నారని పేర్కొన్నారు. మెరిట్, రోస్టర్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

నాట్య తపస్వి పురస్కారం



అవార్డు అందుకుంటున్న నాట్యాచార్య హేమ సుందర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య గురువు, నాట్యాచార్య దువ్వి హేమసుందర్ నాట్య తపస్వి అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన స్వర మహతి కళాపరిషత్ సంస్థ ఆధ్వర్యంలో రాజమండ్రి ఆనం కళాకేంద్రంలో జరిగిన భరతముని ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం హేమ సుందర్‌కు అవార్డు అందజేశారు. నాగపూర్‌కు చెందిన భరతనాట్యం, మోహినిఅట్టం నర్తకి ప్రమీలా ఉన్నికృష్ణన్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఆదిత్య కిరణ్, కాకినాడ, రాజమండ్రికి చెందిన నాట్యాచార్యులు హరి లోకేష్‌శర్మ, అనెం ప్రసాద్ తదితరుల సమక్షంలో పురస్కారం అందుకున్నారు. 27 ఏళ్లుగా హేమసుందర్ కూచిపూడి నృత్యంతో పాటు వివిధ భారతీయ శాస్త్రీయ నృత్యరీతులకు అందిస్తున్న సేవలు అమోఘమని వక్తలు కొనియాడారు. అభినయ నృత్యభారతి విద్యార్థులు, తల్లితండ్రులు, ఏలూరులోని వివిధ కళాసంస్థల సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఏలూరు టౌన్: నగరంలోని పవర్‌పేటలో ఓ ఇంటిలో పేకాట స్థావరంపై టూటౌన్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై శుభశేఖర్ తమ సిబ్బందితో దాడి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 10 సెల్‌ఫోన్లు, రూ.61,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చంద్రశేఖర్ చెప్పారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదనీ, కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

భక్తుల బారులు



బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం భక్తులు బారులు తీరారు. రాష్ట్రంతోపాటు తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మర్లగూడెంలో పాటెమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని దర్శించుకున్నారు.

– బుట్టాయగూడెం



విశేష పూజలు

పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి ఒక్కరోజు ఆదాయం రూ.80,757 లభించినట్టు దేవస్థానం చైర్మన్ చల్లగోళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయ ఈఓ ఎన్.సతీష్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

–పెదవేగి

78 శాతం పింఛన్ల పంపిణీ

ఏలూరు (మెట్రో): జిల్లావ్యాప్తంగా ఆదివారం వేకువజాము నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ మొదలైంది. జి ల్లాలో 2.80 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.77.93 కోట్లు విడుదల చేసింది. వలంటీర్లు రాత్రి 9 గంటల వరకు 2,20,095 మందికి రూ.61.06 కోట్లు అందజేశారని డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. గాంధీ జయంతి సెలవు రోజైనా సోమవారం కూడా పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.



ఏలూరులో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనిత

విజయవంతంగా స్వచ్ఛతాహీ సేవ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కదిలిన యంత్రాంగం

ఏలూరు (మెట్రో): స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం అమలులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యంత్రాంగం, ప్రజలు కదిలారు. గత 15 రోజులుగా ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో అనేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరు జిల్లాలోని 547 పంచాయతీల్లో అదే విధంగా పశ్చిమగోదావరి జిల్లాలోని 409 పంచాయితీల్లో పారిశుధ్య కార్మికులు అనేక పనులు చేపట్టి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఏలూరు జిల్లాలో 1,345, పశ్చిమగోదావరి జిల్లాలో 1,163 మంది క్లాప్ మిత్రలు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా క్లాప్ మిత్రలకు సన్మానాలను జిల్లా అధికారులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు జిల్లాలో 4,47,522 మంది ప్రజలు పాల్గొని 9602 కార్యక్రమాలను చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1,69,518 మంది పాల్గొని 4844 కార్యక్రమాలు చేపట్టారు. 15వ తేది నుంచి నిర్వహించిన కార్యక్రమాల్లో ఏలూరు జిల్లా ప్రథమ స్థానం సాధిస్తే పశ్చిమగోదావరి జిల్లా 4వ స్థానాన్ని సాధించింది.

- ఏలూరు జిల్లా ప్రభుత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా ఒక గంటపాటు చేపట్టే పారిశుధ్య పనులు నిర్వహించడంలో జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా ప్రథమ స్థానాన్ని సాధించింది. ఏలూరు జిల్లా ప్రథమ స్థానం సాధించడం పట్ల కలెక్టర్ జిల్లా ప్రజలకు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య పరీక్షలు

మహాత్మా గాంధీ 155వ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్లు ఆదేశించారు. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

రోడ్లు ఊడ్చిన మంత్రులు, అధికారులు

తణుకు రూరల్ మండలం వేలూర్పు గ్రామంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ చీపుర పట్టి రోడ్లు ఊడ్చారు. భీమవరంలో జరిగిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలో ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా రోడ్లు ఊడ్చి పరిశుభ్రత ఆవశ్యకతపై మాట్లాడారు.



తణుకు టౌన్: వేలూర్పులో చీపురు పట్టి వీధులు ఊడుస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో రోడ్లు శుభ్రం చేస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



ఏలూరు రూరల్: పాలగూడెం గ్రామంలో రోడ్లు ఊడుస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సచివాలయాలు దేశానికే ఆదర్శం



విప్పర్రులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: రాష్ట్రాభివృద్ధికి సచివాలయాల వ్యవస్థతో పాటు, రైతుల అభ్యున్నతి కోసం ఆర్బీకేల నిర్మాణాలను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగనన్న సేవలు దేశానికే ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం పడమర విప్పర్రులో సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. పార్టీ నాయకులు కోసూరి చంటిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం, మహాత్మాగాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో టీడీపీ అధినేత అధికారం అడ్డుపెట్టుకొని విచ్చలవిడి దోపిడీలు చేశారన్నారు. నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థ, రైతుల అభ్యున్నతి కోసం ఆర్బీకేల వ్యవస్థలను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. రూ. 3 కోట్లతో కె.పెంటపాడు నుంచి గణపవరం వెళ్లే రహదారి కోసం శనివారం రాత్రి శంకుస్థాపనం చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కె.పెంటపాడు నుంచి గణపవరం వయా విప్పర్రు మీదుగా రూ. 3 కోట్లతో సీసీ రోడ్డు సుమారు రెండు రోజుల్లో ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీచ్‌లో ఇద్దరు యువకుల గల్లంతు



మృతుడు ఆకన సత్య ప్రసాద్(ఫైల్)

మొగల్తూరు: పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. మండలంలోని రామన్నపాలెం పంచాయతీ ఆకన వారితోటకు చెందిన 10 మంది యువకులు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పేరుపాలెం బీచ్‌కు వెళ్లారు. సముద్ర స్నానానికి దిగిన ఆకన సత్యప్రసాద్, కొమ్ముల శ్రీరామ చంద్ర మూర్తిలు గల్లంతు కాగా, మద్దుల సాయిని స్థానికులు రక్షించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. గల్లంతైన ఇద్దరిలో సత్య ప్రసాద్(18) మృతదేహం తీరానికి కొట్టుకు రాగా, శ్రీరామచంద్రమూర్తి కోసం గాలిస్తున్నారు. సత్యప్రసాద్ 10వ తరగతి పాసై తండ్రి వ్యవసాయ పనుల్లో సహకరిస్తుండగా, శ్రీరామ చంద్రమూర్తి నరసాపురంలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో విద్యార్థిని మృతి



డెంగీతో మృతి చెందిన కలపర్తి శ్రావ్య

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెంకు చెందిన విద్యార్థిని డెంగీ జ్వరంతో మృతిచెందింది. 10వ తరగతి విద్యార్థిని కలపర్తి శ్రావ్య వారం రోజుల క్రితం జ్వరానికి గురైంది. తండ్రి వెంకటేశ్వరరావు స్థానికంగా వైద్యం చేయించగా జ్వరం తగ్గకపోవడంతో జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో వైద్యం చేయించారు. అయినప్పటికి తగ్గకపోవడంతో రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు డెంగీ జ్వరంగా నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థిని ఆదివారం ఉదయం మృతిచెందినట్లు తండ్రి వెంకటేశ్వరరావు తెలిపారు.

వయోవృద్ధుల అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడిగా మేళం



మేళం దుర్గాప్రసాద్‌కు నియామక పత్రం అందచేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): వయోవృద్ధులు, తల్లిదండ్రులు సంక్షేమ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడిగా మేళం దుర్గాప్రసాద్‌ను నియమిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ, తహసీల్దార్ తదితరులు దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

కానిస్టేబుల్‌పై దాడి.. పరిస్థితి విషమం

- వినాయక నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉండగా ఘటన
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలింపు



గంధం నరేంద్ర

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లిలో వినాయకుడి నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒక వ్యక్తి దాడి చేసి తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామంలోని వినాయక నిమజ్జనం సందర్భంగా శనివారం రాత్రి స్టేషన్‌కు చెందిన గంధం నరేంద్ర(32) బందోబస్తుకు వెళ్లారు. ఊరేగింపు అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో డీజే లు పెట్టి డ్యాన్స్‌లు వేస్తూ ఆలస్యం చేస్తుండటంతో కానిస్టేబుల్ త్వరగా ముందుకు వెళ్లండి అని చెప్పాడు. దీంతో అక్కడే డ్యాన్స్ చేస్తున్న ఉలాస రామకృష్ణ(27) మద్యం మత్తులో కానిస్టేబుల్ నరేంద్ర తలపై శ్లాబ్‌కు వాడే బాదుతో దాడి చేసి బలంగా కొట్టడంతో కానిస్టేబుల్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడ ఉన్నవాళ్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే మెదడులో గాయమైనట్లు చెబుతున్నారు. కానిస్టేబుల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలం పోలిశెట్టిపాడుకు చెందిన నరేంద్ర 2018లో కానిస్టేబుల్‌గా నియమితులై చాట్రాయి పోలీసుస్టేషన్‌లో జాయినయ్యాడు. అక్కడ ఐదేళ్లు పూర్తికావడంతో మూడు నెలల క్రితమే చాట్రాయి నుంచి ఆగిరిపల్లికి బదిలీఅయ్యాడు. నరేంద్రకు భార్య, మూడేళ్ల కుమారుడు, 9 నెలల కుమార్తె ఉన్నారు. కానిస్టేబుల్ ఉన్న విజయవాడ ఆసుపత్రికి ఏలూరు జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి ఆదివారం వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అతని కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యాన్ని కల్పించారు. ఎస్పీ వెంట నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ ఉన్నారు.



అపస్మారక స్థితిలో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నరేంద్ర

పోలీసుల అదుపులో నిందితుడు

దాడిపై చేసిన నిందితుడు ఉలాస రామకృష్ణ(27)ను పోలీసులు అరెస్టు చేశారు. నూజివీడు జడ్జి సెలవులో ఉండటంతో తిరువూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

గోవులను రక్షించాం.. బాధ్యతగా కాపాడుకుందాం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: కబేళాకు తరలిస్తున్న గోవులను మనమే రక్షించాం.. మనమే బాధ్యతగా సంరక్షిద్దామని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు హైస్కూలు క్రీడా ప్రాంగణంలో ఉంచిన ఆవులు, దూడలను పార్టీ నేతలు, రైతులు, పశుపోషకులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శనివారం రాత్రి విజయనగరం జిల్లా గజపతినగరం నుంచి హనుమాన్ జంక్షన్, నూజివీడు మీదుగా హైదరాబాద్ పాతబస్తీలోని కబేళాకు రెండు లారీల్లో తరలిస్తున్న 60 ఆవులు, 50 ఆవు దూడలు, 10 కోడె గిత్తలు మొత్తం 120 పశువుల మందను మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ రామిశెట్టి మురళి, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ పోలీసులకు సమాచారం ఇచ్చి రక్షించారన్నారు. సీఐ మూర్తి ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేష్, సిబ్బంది పశువుల లారీలను స్వాధీనం చేసుకున్నారని, విజయవాడ, ద్వారకాతిరుమల, కొప్పాకలోని గో సంరక్షణా కేంద్రాలను సంప్రదించగా, ఎక్కువ పశువులను మేపడం సాధ్యపడదని అన్నారన్నారు. దీంతో పశువుల మందను తనతో చర్చించి ముసునూరు హైస్కూల్‌కు తరలించారన్నారు. లారీల్లో తాళ్లతో కట్టి బంధించడంతో కొన్ని పశువులు అనారోగ్యం బారినపడటంతో పాటు గాయాలపాలయ్యాయన్నారు. వీటికి పశువైద్యాధికారి వెంకట చైతన్య ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఒక ఆవు మృతి చెందగా ఖననం చేశారన్నారు. రైతులు, పశు ప్రేమికులు, పోషకులు అధికంగా ఉండే గ్రామం కావడంతో వేకువజాము నుంచి పలువురు స్వచ్ఛందంగా పచ్చగడ్డిని తెచ్చి గోవులను మేపుతున్నారని, వీరి సేవలు అభినందనీయమన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ రేగుల సోదరులు గోపాలకృష్ణ, లోకేశ్వరరావు రెండు ట్రాక్టర్లతో పచ్చ గడ్డి, ట్యాంకర్లతో మంచినీటిని ఏర్పాటు చేసి, సంరక్షణ చర్యలు చేపట్టారన్నారు.



పశువుల వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వృద్ధులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

సాక్షి, భీమవరం: వయోవృద్ధులను ఇబ్బంది పెట్టే వారికి ఇబ్బందులు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. ఆదివారం భీమవరం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెల స్పందన కార్యక్రమం ద్వారా సుమారు 10 నుంచి 15 సీనియర్ సిటిజెన్స్ సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సీనియర్ సిటిజెన్స్‌ని ఇబ్బంది పెట్టే వారికి ఇబ్బందులు తప్పవని గట్టిగా హెచ్చరించారు. ట్రిబ్యునల్ ద్వారా సమీక్షించి వారి ఆస్తుల రిజిస్ట్రేషన్లను రద్దు చేయడం, వయోవృద్ధులకు పోలీస్ ప్రొటెక్షన్ కల్పించడం, దోషులుగా తెలిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం ఉంటుందని తెలిపారు. వయోవృద్ధుల పట్ల గౌరవంగా ఉండడం పిల్లలకు నేర్పించాలని, వయోవృద్ధులు వచ్చే తరానికి ఆదర్శం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా వయోవృద్ధులను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. భారతీయ సంస్కృతిలో చిన్నప్పటి నుంచి వృద్ధులు, పెద్దల పట్ల ఎలా మెలగాలో నేర్పిస్తారన్నారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉంటే వారి కుటుంబ విలువలు బాగుంటాయని, ఇప్పటి తరం వాటిని కోల్పోతున్నారన్నారు. వయోవృద్ధులను కలెక్టర్ సన్మానించి మెమొంటో, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి జీసీహెచ్ ప్రభాకర్, అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మెళ్ళం దుర్గాప్రసాద్, భీమవరం డివిజన్ సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ అధికారి చంద్రాజీ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చిట్టి వెంకయ్య, స్టేట్ జనరల్ సెక్రటరీ కే రామచంద్రరావు, అడ్వయిజర్ వీరారావు, నల్లం వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులను సత్కరించి మెమొంటోలు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కూలీ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం తుమ్మగొప్పు గ్రామానికి చెందిన యర్రంశెట్టి సూర్యనారాయణ (38) ప్రతి రోజు కూలిపనులకు వెళ్తూ వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం అదే గ్రామానికి చెందిన యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ రొయ్యల చెరువు వద్ద బోరులు తవ్వే కూలి పనికి సూర్యనారాయణ వెళ్లాడు. బోర్లు తవ్వుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చే హైటెన్షన్ విద్యుత్ వైరు తగలడంతో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెరువు యజమాని ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనరేటర్ దగ్ధం



అయిభీమవరంలో సెల్‌టవర్ వద్ద జనరేటర్ మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం గ్రామంలోని సెల్‌టవర్‌కు జనరేటర్ విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఆదివారం దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంటల్ని అదుపు చేశారు. సంఘటనలో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు చెప్పారు.

నేడు శాంతి ర్యాలీ

సాక్షి, భీమవరం: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అహింసా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ మండపాలు, ముఖ్యప్రదేశాల్లో అహింసా ర్యాలీ, శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. భీమవరం నుంచి పెదనిండ్రకొలను, తాడేపల్లిగూడెం, నల్లజర్ల, నిడదవోలు మీదుగా మల్లవరం ఆనందనికేతన్ గాంధీ స్మారకకేంద్రం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రసాదరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మొగల్తూరు: మొగల్తూరు జాతీయ రహదారిపై కొండావారిపాలెం సమీపంలో వ్యాన్ ఢీకొనడంతో ఓ వ్యక్తిగా గాయపడి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక దయాల్ దాస్‌పేటలో ఉంటున్న విశ్రాంత ఎంఈవో పిట్టా సూర్యచంద్రరావు(68) ఆదివారం ఉదయం కొండావారిపాలెంలోని చర్చికి వెళ్ళేందుకు జాతీయ రహదారి దాటుతుండగా వ్యాన్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాలమర్రు గ్రామానికి చెందిన వేండ్ర మల్లయ్య (59) చెరువులో పడి మృతి చెందినట్లు భార్య దుర్గ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై శ్రీస్ శ్రీనివాసు కథనం ప్రకారం.. మల్లయ్య శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ఇంటికి రాలేదు. అతని కోసం వెతకగా చెరువులో పడి మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గునపంతో భర్తపై దాడి

జంగారెడ్డిగూడెం రూరల్: భర్తపై భార్య గునపంతో దాడి చేసిన ఘటన మండలంలోని లక్కవరంలో ఆదివారం చోటు చేసుకుంది. లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం లక్కవరానికి చెందిన బాకి ఏడుకొండలు లారీ క్లీనర్‌గా పనిచేస్తుంటాడు. నెల రోజుల క్రితం గుజరాత్ వెళ్తున్న చేపల లారీపై క్లీనర్‌గా ఏడుకొండలు వెళ్లాడు. తిరిగి ఈ నెల 28న లక్కవరం స్వగ్రామానికి వచ్చాడు. రూ.10,500 నగదును ఏడుకొండలు తన భార్య లక్ష్మీకి ఇచ్చాడు. తక్కువ డబ్బులు ఇస్తున్నావేమిటని లక్ష్మీ భర్తతో గొడవ పడింది. ప్రతీ రోజు నగదు విషయమై భార్య భర్తల మధ్య వివాదం జరుగుతుంది. ఆదివారం గొడవ నేపథ్యంలో లక్ష్మీ గునపంతో ఏడుకొండలు తలపై కొట్టింది. దీంతో ఏడుకొండలు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు.



గాయపడిన బాకి ఏడుకొండలు

తెనాలి వెళ్లి పింఛన్ పంపిణీ



తెనాలిలో పింఛన్ అందజేస్తున్న వలంటీరు

పెదపాడు: మండలంలోని వట్లూరు–2 గ్రామ సచివాలయానికి చెందిన ఓ వలంటీరు తెనాలి వెళ్లి ఓ వృద్ధురాలికి పింఛన్ అందించాడు. వట్లూరుకు చెందిన వృద్ధురాలు లంకా మల్లికాంబ అనారోగ్యం కారణంగా తెనాలిలో ఉంటుంది. ఆమెకు పింఛన్ అందించాలనే వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి సూచనల మేరకు తెనాలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు వలంటీరు నరహరశెట్టి రాజశేఖర్ ఆదివారం పింఛన్ అందించాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామవరపుకోట: మండలంలో ఆడమిల్లి సెంటర్‌లో రోడ్డు పక్కన శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు తడికలపూడి ఎస్సై జయబాబు తెలిపారు. అతని వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వరకు ఉంటుందని, నలుపు రంగు ప్యాంట్, నలుపు గళ్ల షర్టు ధరించాడని తెలిపారు.

లైంగిక వేధింపులపై కేసు

చింతలపూడి: విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్న ఆర్‌కె స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు తెలిపారు. విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ ఆర్‌కె స్టడీ సర్కిల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ఆందోళన చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

యూత్ క్లబ్‌లో ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్

సాక్షి, భీమవరం: భీమవరం యూత్ కల్చరల్ అసోసియేషన్(యూత్‌క్లబ్) ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫైడ్‌రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. ఆదివారం యూత్‌క్లబ్‌లో టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో అక్టోబర్ 28, 29 తేదీల్లో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులతోపాటు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఈ పోటీల్లో సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని నర్సింహరాజు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పేరిచర్ల వెంకట శ్రీనివాసరాజు(సుభాష్), కార్యదర్శి కూసంపూడి వెంకట సత్యనారాయణరాజు, కోశాధికారి కూనపరాజు సత్యనారాయణరాజు, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదాసు కిషోర్, గమిని రవి పవన్‌కుమార్, వేగేశ్న రామకృష్ణంరాజు, కొత్తపల్లి శ్రీనివాసరాజు, సాగి బాలసూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం యూత్ క్లబ్‌లో చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం